# సకల సదుపాయాలు.. మెరుగైన బోధన

- పదిలో ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు
- ఆదర్శంగా నిలుస్తున్న చాంద(టీ) జడ్పీహెచ్ఎస్
- కొత్తగా 160 మంది విద్యార్థులు చేరిక
- మన ఊరు-మన బడితో పాఠశాల అభివృద్ధి


మన ఊరు-మనబడి కింద అభివృద్ధి చేసిన పాఠశాల భవనం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 19 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యావిధానంలో సమూల మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ దీటుగా మారాయి. పచ్చదనం, పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం, శుద్ధమైన తాగునీరు, ఇంగ్లిష్ మీడియం బోధనతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో కళకళలాడుతున్నాయి. కొన్ని చోట్ల సీట్లు నిండిపోయాయి అనే బోర్డులు కూడా కనిపిస్తున్నాయి. మొత్తం గ్రామాల నుంచి పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ పాఠశాల పదో తరగతి ఫలితాల్లో పది సంవత్సరాలుగా 90 శాతంపైగా ఉత్తీర్ణత సాధిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న విద్యా దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ మండలంలోని చాంద(టీ) జడ్పీహెచ్ఎస్ పాఠశాలపై కథనం..

### పాఠశాలలో 160 మంది విద్యార్థులు..

చాంద(టీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుతున్నారు. పది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం కొనసాగుతున్నది. విద్యార్థుల కోసం అనువైన ప్రయోగశాలలు ఉన్నాయి. విద్యార్థులకు రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

### మన ఊరు-మన బడి కింద అభివృద్ధి

మన ఊరు–మన బడి కింద ప్రభుత్వం కేటాయించిన నిధులతో ఈ పాఠశాలను అభివృద్ధి చేశారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు అమర్చడం, పాఠశాలకు రంగులు వేశారు. అలాగే శుద్ధజలం, బాలబాలికలకు ప్రత్యేక మూత్రశాలల సౌకర్యం కల్పించారు. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల చదువుల గురించి వివరిస్తున్నారు. ఎస్సీ, బీసీ, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు వచ్చేలా చూస్తున్నారు. అదే విధంగా బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచారు.

### మరింత ప్రగతి



చాంద(టీ) జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో మెరుగైన బోధన జరుగుతున్నది. ఇంగ్లిష్ మీడియం కావడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని మన ఊరు–మన బడి కింద కేటాయించిన నిధులతో పాఠశాలకు సౌకర్యాలు కల్పించుకున్నాం. హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం.

**- జీ శశికళ, ప్రధానోపాధ్యాయురాలు, చాంద(టీ) జడ్పీహెచ్ఎస్**

### పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం



పాఠశాల పచ్చదనంతో నిండి ఆహ్లాదక వాతావరణంతో ఉత్సాహవంతంగా ఉంటుంది. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. జాతీయ పండుగ సందర్భాల్లో సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆటాపాటలలో కూడా మా పాఠశాల స్ఫూర్తిగా నిలిచింది. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు మా పాఠశాలలో అందుబాటులో ఉన్నాయి.

**- టీ లక్ష్మి, విద్యార్థి, జడ్పీహెచ్ఎస్, చాంద**


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన నల్లాలు


తరగతి గదిలో నిండిపోయిన విద్యార్థులు

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి


అర్జీలను స్వీకరిస్తున్న శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ

ఎదులాపురం, జూన్ 19 : ప్రజావాణి అర్జీలను నిబంధనల మేరకు పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని శిక్షణ సహాయ కలెక్టర్ పీ శ్రీజ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. భూ సంబంధ సమస్యలు, పింఛన్, ఉపాధి కల్పన, డబుల్ బెడ్రూం ఇండ్లు, తదితర సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి ఆయా శాఖాధికారులకు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజవాణిలో ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్, ఇన్‌చార్జి డీఆర్‌వో అరవింద్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం


అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్, డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్, జూన్ 19 : ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్, డీడీ దిలీప్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ఆదివాసీ, గిరిజనులు వివిధ సమస్యలపై ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్ర సత్యవతి దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి చెరువగూడకు చెందిన సోయం జంగు తమ గ్రామానికి వసతిగృహం మంజూరు చేయాలని విన్నవించారు. ఆసిఫాబాద్ మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన టేకం కవిత డిగ్రీ కళాశాలలో స్వీపర్ ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తులు సమర్పించారు. అర్జీలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఫిర్యాదులు షురూ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్ టౌన్, జూన్ 19: నిర్మల్‌లోని కొత్త కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుల విభాగాన్ని మొదటిసారిగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాంబాబు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 20 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లాలో విద్య సంవత్సరం ప్రారంభమైనందున ప్రైవేట్ విద్య సంస్థల ఫీజులను నియంత్రించాలని, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు నరేందర్ వినతిపత్రం ఇచ్చారు. అదే విధంగా బాసరలో విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, అనుమతులు లేకుండా జిల్లాలో ప్రవేశాలు నిర్వహిస్తున్న విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకులు అరవింద్ కోరారు.

### పశువుల షెడ్డులో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఖానాపూర్ రూరల్, జూన్ 19 : ఖానాపూర్ మండలం రాజురా గ్రామంలో ఆదివారం రాత్రి రైతు రాపెల్లి భీమన్నకు చెందిన పశువుల షెడ్డులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఫైర్ స్టేషన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదంలో 10 గొర్రెలు, ఒక ఎద్దు మృతి చెందినట్లు తెలిపారు. 60 గొర్రెలతో పాటు ఒక ఎద్దును కపాడామని, గోర్లు మృతి చెందడంతో రైతుకు మూడు లక్షల నష్టం జరిగినట్లు వెల్లడించారు. ఇందులో అగ్నిమాపక సిబ్బంది మధుకర్, సత్తన్న, హరికృష్ట పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందిస్తాం

నిర్మల్ అర్బన్, జూన్ 19: జిల్లా ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. నిర్మల్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఓపికగా విని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సహాయం కావాలనుకునే వారు 8712659599 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.


సమస్యలు వింటున్న నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

## దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్, జూన్ 19 : నిర్మల్ జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో పీజీసీఆర్టీ, సీఆర్టీ) మొత్తం 60 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయనున్నామని, అర్హత గల మహిళా అభ్యర్థులు ఈ నెల 26 నుంచా జులై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.